క్లుప్తంగా

దాసాంజనేయుడికి ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం శ్రీ దాసాంజనేయ స్వామివారి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

బాబా మందిరంలో అన్నప్రసాద వితరణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో శనివారం మందిర వార్షికోత్సవం ముగింపు పురస్కరించుకొని అన్నప్రసాద వితరణ జరిగింది. సుమారు 500 మందికి అన్నప్రసాద వితరణ చేశారు. తొలుత బాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమాలను మందిరం వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు పర్యవేక్షించారు.

ఎన్టీ రామారావుకు స్వరాంజలి



విజయవాడ కల్చరల్: ప్రణవీ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో సినీ నటుడు ఎన్టీఆర్ శతజయంతి సందర్భంగా గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం సినీ సంగీత విభావరి, గాయకుడు సునీల్‌కుమార్‌కు ఆత్మీయ పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన ప్రణవీ మ్యూజిక్ అకాడమీ వ్యవస్థాపకుడు కారుమంచి రాజు మాట్లాడుతూ తెలుగువారి కీర్తిని జాతీయ స్థాయికి తీసుకువెళ్లిన నటుడు ఎన్టీఆర్ అని అభివర్ణించారు. ఎన్టీఆర్‌కు భారతరత్న పురస్కారం ప్రదానం చేయాలని కోరారు. గాయకుడు సునీల్‌కుమార్ ఎన్టీఆర్ సినీ రంగ సేవలను వివరించారు. గాయకులు పద్మ, భారతి, నవీన, సుహాసినీలు ఎన్టీఆర్ నటించిన చిత్ర గీతాలను ఆలపించారు. గాయకుడు సునీల్‌కుమార్‌ను నిర్వాహకులు సప్తస్వర గాన గంధర్వ బిరుదుతో సత్కరించారు.

భక్తి తత్వాన్ని చాటిన కబీర్ నాటకం



విజయవాడ కల్చరల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ, ఏపీ సృజనాత్మక సమితి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఆధ్వర్యంలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శనివారం ప్రదర్శించిన కహాన్ కబీర్ హిందీ నాటకం భక్తి తత్వాన్ని చాటింది. కబీర్‌దాస్ భారతీయుల ఆధ్యాత్మిక గురువు. కబీర్ కాలం నాటి మనుషుల జీవన విధానం, సామాజిక పరిస్థితులను నాటకంలో పొందుపరిచారు. రచన, దర్శకత్వం బన్సీకౌల్ వ్యవహరించారు. కార్యక్రమంలో భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు ఆర్. మల్లికార్జునరావు, సాంస్కృతిక శాఖ మేనేజర్లు సీహెచ్ శ్రీనివాస్, సుమన్, నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా ఫ్యాకల్టీ వినయ్ పాల్గొన్నారు. నేటితో భారత్ రంగ మహోత్సవ్ కార్యక్రమాలు ముగుస్తాయి. ఆదివారం కర్ణాటక వారి అయోధ్యకాండ నాటకం ప్రదర్శిస్తారు.

నేడు ఖురాన్ కంఠస్థ పోటీలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ ఆటోనగర్‌లోని ది ఆటోమొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ హాల్లో ఆదివారం 9వ రాష్ట్ర స్థాయి బాల, బాలికల ఖురాన్ కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ చైర్మన్ మొహ్మద్ దావూద్, సిటీ ఇన్‌చార్జి షేక్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ పోటీల్లో మూడు నుంచి 12 ఏళ్లలోపు బాల బాలికలు పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ మైనార్టీ వ్యవహారాల ప్రత్యేక కార్యదర్శి ఏఎండీ ఇంతియాజ్ ముఖ్యఅతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు అందిస్తారని పేర్కొన్నారు.

రేపు ఇన్‌స్పైర్ పోటీలు

గుణదల (విజయవాడ తూర్పు) : విద్యార్థులను శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా నిర్వహిస్తున్న ఇన్‌స్పైర్ సైన్స్ ప్రాజెక్ట్ పోటీలు సోమవారం ఆంధ్ర లయోల కళాశాలలో ఏర్పాటు చేస్తున్నట్లు డీవైఈఓ కుమార్ తెలిపారు. ఈ మేరకు లయోల కళాశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో కమిటీ మెంబర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం జిల్లా స్థాయి సైన్స్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించి పాఠశాల విద్యార్థుల నుంచి ఇప్పటికే 143 ప్రాజెక్టులు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికవుతారని వివరించారు.

సీఎం జగన్‌ను ఎదుర్కొనే సత్తా ఎవరికీ లేదు



ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావును శాలువాతో సత్కరిస్తున్న వృద్ధురాలు



దివ్యాంగుడికి కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనే సత్తా ఏ రాజకీయ పార్టీకి లేదని సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 31వ డివిజన్ పసుపుతోటలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, కార్పొరేటర్ పెనుమత్స శిరీషతో కలిసి ఆయన ప్రతీ గడపకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. దారి పొడవునా మహిళలు, పలు పథకాల లబ్ధిదారులు హారతులు ఇస్తూ, శాలువాలు కప్పుతూ ఘన స్వాగతం పలికారు. రాబోయే ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌ను గెలిపించుకుంటామంటూ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా వెలంపల్లి మాట్లాడుతూ ప్రజల అవసరాలను గుర్తించి కులమత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ ఫలాలను గడప వద్దకే అందించామని గుర్తు చేశారు. నీచ, వెన్నుపోటు రాజకీయాలకు కేరాఫ్ చంద్రబాబునాయుడు అని అన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం ఎన్నికల్లో గెలవడమే ధ్యేయంగా చంద్రబాబు పొత్తుల కోసం పరితపిస్తున్నాడని పేర్కొన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు ఒక్క సంక్షేమ పథకాన్ని అయినా అమలు చేసాడా అని ప్రశ్నించారు. మహానేత వైఎస్సార్‌ను చూస్తే ఆరోగ్యశ్రీ గుర్తొస్తుందని.. చంద్రబాబును చూస్తే నీచ రాజకీయాలు తప్ప ఏమీ గుర్తుకురావని ఎద్దేవా చేశారు.

వైఎస్సార్ సీపీ ప్రజాదరణ చూసి లోకేష్ పరార్

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీకి రోజురోజుకు పెరుగుతున్న ప్రజాదరణ చూసి లోకేష్ పరారయ్యాడని వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. లోకేష్ ఫామ్‌హౌస్‌లో దాక్కొని రెడ్, ఎల్లో బుక్స్ చదువుకుంటున్నాడని విమర్శించారు. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రజలను గాలికి వదిలేసి హైదరాబాద్‌లో కూర్చుని రాజకీయాలు చేయడం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు మాత్రమే చెల్లిందని అన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ మాటలను ప్రజలు నమ్మడం లేదని రాబోయే ఎన్నికల్లో వారికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

షర్మిలకు రాష్ట్రంపై అవగాహన లేదు

షర్మిలకు ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన లేదని వెలంపల్లి అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టింది కాంగ్రెస్ పార్టీ కాదా అని ప్రశ్నించారు. హైదరాబాద్ నగరాన్ని ఏపీ నుంచి దూరం చేసింది కాంగ్రెస్ పార్టీనేనని, రాష్ట్రాన్ని మోసం చేసిన కాంగ్రెస్ పార్టీలో ఉండి షర్మిల మాట్లాడటం దుర్మార్గం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, వార్డు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే ప్రజల అభీష్టం

ఎంపీ కేశినేని నాని



ఎంపీ కేశినేనికి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని బహూకరిస్తున్న తిరువూరు నాయకులు

విజయవాడస్పోర్ట్స్: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ కేశినేని నాని అన్నారు. సీఎం జగన్ సారథ్యంలోని సంక్షేమ రాజ్యం కచ్చింతంగా వస్తుందని తెలిపారు. విజయవాడలోని కేశినేని భవన్‌లో తిరువూరు నియోజకవర్గానికి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ నాయకులతో ఎంపీ కేశినేని శనివారం సమావేశమయ్యారు. నియోజకవర్గంలో చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాలను చర్చించారు. అదేవిధంగా పలు సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకొచ్చారు. బూటకపు సర్వేలతో ప్రజలను అయోమయానికి గురిచేసేందుకు టీడీపీ ప్రయత్నిస్తుందని, అయితే వైఎస్సార్ సీపీని గెలిపించేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని ఎంపీ అన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలను ముందుండి నడిపించడమే గురుతర బాధ్యతగా తీసుకోవాలని నాయకులకు సూచించారు. సమావేశంలో కాకర్ల వైఎస్సార్ సీపీ నాయకులు తాళ్లూరి నవీన్, టేకులపల్లి పీఏసీఎస్ చైర్మన్ ముక్కామల సీతారామయ్య, తిరువూరు కౌన్సిలర్‌లు మోదుగ ప్రసాద్, పసుపులేటి శేఖర్‌బాబు, ఇనపనూరి చిన్నారిరవి, దుర్గారావు, పర్స సత్యనారాయణ, కాకర్లమూడి సుందర్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు షేక్ అజీజ్, గోపాలరావు, నరసింహారావు పాల్గొన్నారు. తొలుత ఎంపీ కేశినేని నానికి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని తిరువూరు నియోజకవర్గ నాయకులు బహూకరించారు.

నేటితో మహిళా ఉత్సవ్ ముగింపు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మహిళలు స్వయం ఉపాధి కోర్సులను నేర్చుకుని వస్తువులను ఉత్పత్తి చేసి విక్రయించడం ద్వారా ఆదాయం సంపాదిస్తూ కుటుంబ అవసరాలను తీర్చుకోవచ్చునని పారిశ్రామికవేత్త పి.పల్లవి చెప్పారు. స్థానిక మధుచౌక్‌లోని మొగల్ ఎగ్జిబిషన్ హాలులో జనశిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో జరుగుతున్న మహిళా ఉత్సవ్–2024లో శనివారం సాయంత్రం మహిళలకు భాతిక్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ వస్త్రధారణ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో 11 మంది పాల్గొన్నారు. మొదటి బహుమతిని బేబీ కేసవి తస్వికశ్రీ, ద్వితీయ బహుమతిని బి.రమణి గెలుపొందారు. జన శిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఎ.పూర్ణిమ విజేతలకు జ్ఞాపిక, ప్రశంశాపత్రాన్ని అందజేశారు. సీనియర్ రిసోర్స్ పర్సన్ పి.వరలక్ష్మి పోటీల న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. జన శిక్షణ సంస్థాన్ సిబ్బందితో పాటుగా మహిళా ఉత్సవ్‌లోని స్టాల్ హోల్డర్స్ పాల్గొన్నారు. ఆదివారంతో మహిళా ఉత్సవ్ ముగిస్తుందని పూర్ణిమ తెలిపారు.

అగ్గిపుల్ల సాయి నగర బహిష్కరణ పొడిగింపు

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించిన పోలవరపు సాయికుమార్ అలియాస్ అగ్గిపుల్ల సాయి నగర బహిష్కరణను మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టీకే రాణా శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొత్తపేటకు చెందిన అగ్గిపుల్ల సాయి గతంలో అనేక నేరాలకు పాల్పడి జైలు జీవితం అనుభవించినా అతని ప్రవర్తలో మార్పు రాకపోవడంతో నగరం నుంచి బహిష్కరించామని పేర్కొన్నారు. నగర బహిష్కరణ జరిగినా అతని ప్రవర్తనలో ఎలాంటి మార్పు రాలేదని తెలిపారు. నగరంలోకి ప్రవేశిస్తే అల్లర్లు సృష్టించి ప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేందుకు సమాయత్తమవుతున్నాడనే నిఘా వర్గాల సమాచారంతో బహిష్కరణను పొడిగించినట్లు స్పష్టం చేశారు. చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడుతున్న, చెడు నడత కలిగిన వ్యక్తులను ఉపేక్షించకుండా నగరం నుంచి బహిష్కరిస్తామని హెచ్చరించారు.

మల్లేశ్వరాలయ పనుల పరిశీలన

కుంభాభిషేకానికి సముద్ర, జీవనదుల జలాలు



మల్లేశ్వర స్వామి వారి ఆలయం పనులను పరిశీలిస్తున్న చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ఆలయ పునర్నిర్మాణ పనులను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఈ కోటేశ్వరరావు, ఏఈవో రమేష్‌బాబు, ఆలయ వైదిక కమిటీ సభ్యులు శనివారం పరిశీలించారు. ప్రతిష్ఠోత్సవాలకు మరో మూడు రోజులే గడువు ఉండటంతో మిగిలిన అరకొర పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆలయానికి జరుగుతున్న ఎలక్ట్రికల్ పనులు, ఏసీ ఏర్పాటు తదితర పనుల గురించి సిబ్బందిని ఆరా తీశారు. అనంతరం నటరాజ స్వామి వారి ఆలయం సమీపంలో నిర్మాణంలో ఉన్న యాగశాల పనులను పరిశీలించారు. కార్యక్రమంలో వైదిక కమిటీ సభ్యులు శంకర శాండిల్య, ఇతర ఇంజినీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు...

ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామి వారి ధ్వజ సహిత స్వర్ణ శిఖర ప్రాణ ప్రతిష్ఠోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. కుంభాభిషేకాన్ని మూడు సముద్రాల జలాలతో పాటు పలు జీవనదుల జలాలను తీసుకొచ్చేందుకు వైదిక కమిటీ సభ్యులకు బాధ్యతలు అప్పగించారు. దేశానికి మూడు వైపుల ఉన్న సముద్రాల జలాలతో పాటు పలు జీవనదుల నుంచి జలాలను అభిషేకం నిమిత్తం తీసుకురానున్నారు. ఇప్పటికే మూడు సముద్రాల జలాలతో పాటు కొన్ని నదుల జలాలను ఆలయ అర్చకులు తీసుకుని భద్రపరిచారు. తూర్పు వైపున ఒరిస్సాలోని కోణార్క్, దక్షిణం వైపున రామేశ్వరం, పడమర వైపున ద్వారక వద్ద సముద్ర జలాలను సేకరించారు. పవిత్ర జలాలను తీసుకొచ్చేందుకు అర్చక బృందం ఆయా ప్రాంతాలకు తరలివెళ్లింది. మహా కుంభాభిషేకం నిర్వహించే తరుణంలో అన్ని జలాలతో పాటు దుర్గాఘాట్ కృష్ణా జలాలను తీసుకుని మేళతాళాలు, మంగళవాయిద్యాలతో ఆలయ అర్చకులు ఊరేగింపుగా మల్లేశ్వర స్వామి వారి ఆలయానికి చేరుకునేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. అత్యంత వైభవంగా ఉత్సవాల నిర్వహణకు కృషి చేస్తున్నారు.



గుణదల మేరీమాత పుణ్యక్షేత్రంలో శతాబ్ది ఉత్సవాలు కనులపండువగా కొనసాగుతున్నాయి. నూరు వసంతాల మహోత్సవాలను తిలకించేందుకు భక్తులు లక్షలాదిగా తరలి వస్తున్నారు. పుణ్యక్షేత్ర ప్రాంగణమంతా యాత్రికులతో నిండిపోయింది. ఏలూరు రోడ్డులోని మేరీమాత ఆర్చివద్ద నుంచి పుణ్యక్షేత్ర ప్రధానాలయం, మేరీమాత స్వరూపం, కొండ శిఖరాగ్రం వరకు భక్త జనం బారులు తీరారు. దీంతో కొండపై గల మెట్ల మార్గాలు, కాలిబాటలు కిక్కిరిసిపోయాయి. శిలువ వద్ద కొవ్వొత్తులు వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. గుణదల కొండ రాత్రి సమయాల్లో విద్యుద్దీప కాంతులతో కాంతులీనుతోంది. ఆదివారం ఉదయం 6:30 నుంచి రాత్రి 12 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



ఉదయపు ప్రార్థనలో పాల్గొన్న ఫాదర్లు



భక్తులకు సత్ప్రసాదం అందిస్తున్న ఫాదర్



గ్రౌండ్‌లో ప్రార్థనలు చేస్తున్న భక్తులు



సాంస్కృతిక ప్రదర్శనలు చేస్తున్న చిన్నారులు

దాతలు సేవా గుణం అలవర్చుకోవాలి



దాతలను సత్కరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ శర్వాణీమూర్తి తదితరులు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి, చలపతిరావు, బలరామకృష్ణమూర్తి తదితరులు

విజయవాడ కల్చరల్: దాతలు సేవా గుణం అలవర్చుకోవాలని సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. నర్మదా అన్నదాన పుష్కర కమిటీ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శనివారం అన్నదాతలకు సన్మానం, అన్నదాన మహాయజ్ఞ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ అన్నదాన సేవను నారాయణ సేవగా భావించాలని సూచించారు. పుష్కర సమయంలో వచ్చే లక్షలాది మంది భక్తులకు అన్నదానం చేయడం సామాన్యమైన విషయం కాదన్నారు. సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ ప్రభుత్వం బ్రాహ్మణ సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. బ్రాహ్మణ సేవా సంఘం, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమైఖ్య గౌరవ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని పేర్కొన్నారు. శ్రీకంఠ ఋష్యాశ్రమ పీఠాధిపతి శ్రీ కంఠ బాలాజీ మాట్లాడుతూ గతంలో గంగా పుష్కరాల సమయంలో లక్షలాది మందికి అన్నప్రసాద వితరణ చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది మే ఒకటో తేదీ నుంచి 13వ తేదీ వరకు జరిగే నర్మదా నది పుష్కరాలకు వచ్చే భక్తులకు నిరంతరం అన్నప్రసాదం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ కోసం నిర్వాహకులకు వెలంపల్లి లక్ష రూపాయల విరాళం అందజేశారు. అనంతరం నిర్వాహకులు దాతలను ఆత్మీయంగా సత్కరించారు. కార్యక్రమంలో విజయవాడ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, కార్పొరేటర్ శర్వాణీమూర్తి, అన్నదాన కమిటీ అధ్యక్షుడు టీవీ రమణమూర్తి, విజయవాడ శృంగేరీ పాదుకా క్షేత్రం అధ్యక్షుడు బీవీ చలపతిరావు పాల్గొన్నారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



26వ డివిజన్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ

మధురానగర్(విజయవాడసెంట్రల్): గుర్తించిన ప్రతీ సమస్యను సత్వరమే పరిష్కరించాలని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అధికారులకు సూచించారు. సెంట్రల్ నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సూచన మేరకు శనివారం ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, డివిజన్ ఇంచార్జ్ అంగిరేకుల గొల్లభామ నాగేశ్వరరావు, నగరపాలకసంస్థ అధికారులతో కలిసి 26వ డివిజన్‌లో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని వాకర్స్ సమస్యలు, మారుతీనగర్‌లోని మంచినీటి సమస్యలు, చుట్టుగుంట ప్రాంతంలో డ్రైనేజీ సమస్యలను స్వయంగా పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల కోసం పని చేసే పార్టీ వైఎస్సార్ సీపీ అని పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి పట్టం కట్టాలని ప్రజలను కోరారు. పర్యటనలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, నగర పాలకసంస్థ అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదరించడం సామాజిక బాధ్యత

డాక్టర్ జూపూడి ఉషారాణి



పౌష్టికాహారం అందజేస్తున్న జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఉషారాణి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిరుపేద చిన్నారులను ఆదరించడం సామాజిక బాధ్యత అని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ జూపూడి ఉషారాణి అన్నారు. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డులోని హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన నిరుపేద చిన్నారులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం శనివారం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పౌష్టికాహార లోపం వల్ల అనేక సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. కావున చిన్నారులకు పౌష్టికాహారం అందించేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని సూచించారు. డీపీఎం కిరణ్ మాట్లాడుతూ హెచ్ఐవీ సోకిన చిన్నారులకు ఏఆర్‌టీ చికిత్సతోపాటు పౌష్టికాహారం అందజేయడం ద్వారా వారి జీవన ప్రమాణం పెంపొందించవచ్చని అన్నారు. ట్రస్ట్ సభ్యులు షఫీవుల్లా, నాగమల్లిక, హేమంతరావు, డాక్టర్ బ్రహ్మదేశం వసంతకుమార్, కే రాము, రహీమా తదితరులు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ సెంటర్ కౌన్సిలర్ కనకాల వరప్రసాద్, వైఆర్‌జీ కేర్ సంస్థ ప్రతినిధులు బీ రాములు, నాగూర్‌బీ పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే ఉన్నత ఉద్యోగాలు



సదస్సులో మాట్లాడుతున్న హిమబిందు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పోటీ పరీక్షల అభ్యర్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ఉన్నత ఉద్యోగాలు సాధించవచ్చని జాబ్ డెవలప్‌మెంట్ డెప్యూటీ డైరెక్టర్ హిమబిందు అన్నారు. ఉపాధి మరియు శిక్షణ శాఖ ఆధ్వర్యాన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో గ్రూప్ 1, 2, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొందడం చక్కటి అవకాశమని పేర్కొన్నారు. అభ్యర్థులు గత పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు కూడా చదివితే పరీక్ష విధానంపై అవగాహన ఏర్పడుతుందని తెలిపారు. రీజినల్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ రామమోహన్‌రెడ్డి పరీక్ష విధానం, కటాఫ్ మార్కులు, క్లరికల్ రీజనింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించారు. జిల్లా ఉపాధి అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉద్యోగాలు సాధించి సెంటర్‌కు మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో మోటివేషనల్ స్పీకర్ శ్రీనివాస్, సత్య, స్టడీ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వెంకటనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఎలక్ట్రిసిటీ దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘాన్ని గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నవాజ్‌ఖాన్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీ ఎలక్ట్రిసిటీ దివ్యాంగ ఉద్యోగుల సంక్షేమ సంఘాన్ని విద్యుత్ సంస్థ గుర్తించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఖాజీపూర్ హంజా నవాజ్‌ఖాన్ కోరారు. శనివారం గాంధీనగర్‌లోని ఎన్జీఓ హోంలో సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంఘం 500 మంది సభ్యులను కలిగి ఉన్నదని విద్యుత్ సంస్థ గుర్తించాలన్నారు. విద్యుత్ సంస్థలో పని చేస్తున్న దివ్యాంగ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో సంఘం రాష్ట్ర నేతలు ఎం.సాయిబాబా, కేసీ అరవింద్‌కుమార్, పీ రవిశంకర్, ఏపీఎస్పీడీసీఎల్ కార్యదర్శి బీవీ సుధాకర్, ఏపీ జెన్‌కో అధ్యక్షుడు కేవీఆర్ చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మైలవరం నియోజకవర్గం పరిధిలోని గ్రామాల్లో వెస్ట్ ఏసీపీ పి. మురళీకృష్ణారెడ్డి, కొత్తపేట సీఐ టి. గణేష్ శనివారం పర్యటించారు. కొత్తూరు తాడేపల్లి, షాబాద్, జక్కంపూడి కాలనీలలోని 18 పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు.